నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్‌: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌ అధికారులు తెలిపారు. శివరాంపల్లి ఫీడర్‌ పరిధిలోని శివరాంపల్లి, ఎన్‌పీఏ కాలనీ, డబ్ల్యూఎస్‌ కాలనీ, మణికంఠ కాలనీ, రెడ్డి కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. భరత్‌నగర్‌ విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని శ్రీదేవి కాలనీ, వీకర్‌ సెక్షన్‌ కాలనీ, ఖాద్రీ హిల్స్‌ ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. చింతల్‌మేట్‌ ఫీడర్‌ పరిధిలోని వాదే సులేమాన్‌నగర్‌, అక్బర్‌ హిల్స్‌ ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.30 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి సబ్‌స్టేషన్‌ పరిధిలో..

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి సబ్‌స్టేషన్‌ పరిధిలోని పలు ఫీడర్లల్లో శనివారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఐడీఏ మైలార్‌దేవ్‌పల్లి ఫీడర్‌లోని సుబాన్‌ కాలనీ ఫేస్‌-1, 2, మిలాన్‌ కాలనీ, రహమత్‌ కాలనీ పార్ట్‌, దస్తగిరి నగర్‌, హష్మాబాద్‌, రాజీవ్‌గాంధీనగర్‌, పటేల్‌నగర్‌, అబ్దుల్లా కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

నేడు ఆస్తిపన్ను పరిష్కార వేదిక

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో శనివారం ఆస్తిపన్ను పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్కిల్‌ ఉప కమిషనర్‌ డాక్టర్‌ రవికుమార్‌ తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమాన్ని సర్కిల్‌ కార్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. ఆస్తిపన్నుపై హెచ్చుతగ్గులు తదితర వాటిపై ఈ కార్యక్రమానికి హాజరై ఫిర్యాదు చేయవచ్చునన్నారు. సంబంధిత అధికారులు అక్కడే సమస్యలను పరిష్కరిస్తారన్నారు. ఈ ఆస్తిపన్ను పరిష్కార వేదికను సర్కిల్‌ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వెటర్నరీ విశ్వవిద్యాలయం వీసీగా జ్ఞాన ప్రకాశ్‌



ఏజీవర్సిటీ: పీవీ నర్సింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతిగా మంతటి జ్ఞాన ప్రకాశ్‌ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జీఓ జారీ చేసింది. వరంగల్‌కు చెందిన జ్ఞాన ప్రకాశ్‌ గతంలో పశువైద్య విశ్వవిద్యాలయం అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా, కంట్రోలర్‌గా, రిజిస్ట్రార్‌గా పనిచేశారు. దీంతో పాటు గొర్రెలు, మేకలు, పందులు, పౌల్ట్రీ, పశువుల పరిశోధన కేంద్రాలకు అధిపతిగా పనిచేశారు.

కొనసాగుతున్న ద్రాక్ష ఫెస్టివల్‌



ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ద్రాక్ష పరిశోధన కేంద్రంలో ద్రాక్ష ఫెస్టివల్‌ కొనసాగుతోంది. ఇందులో సుమారు 10 రకాల ద్రాక్ష పండ్లు ఉన్నాయి. సందర్శకులు నేరుగా తోటలోకి వెళ్లి రుచి చూసి ద్రాక్ష తీగల నుంచి పండ్లను కోసుకుని తెచ్చుకోవచ్చు. నల్లా ద్రాక్ష, చిన్న ద్రాక్షతో పాటు వివిధ రకాల ద్రాక్షలు ఉన్నాయి.

‘టీటా’ సభ్యత్వ నమోదు ప్రారంభం

రాయదుర్గం: తెలంగాణ ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ అసోసియేషన్‌(టీటా) సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆ సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు సందీప్‌ కుమార్‌ మక్తల ప్రారంభించారు. హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌ ప్రాంగణంలో టీటా కార్యాలయంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు, కార్పొరేట్‌ మెంబర్లు, ఎన్‌ఆర్‌ఐలు, విద్యార్థులు, అసోసియేట్‌ సభ్యులు, ఐటీ ఫ్యాకల్టీ, ప్రభుత్వ రంగం నుంచి ఐటీ విభాగంలో ఉన్న వారు సభ్యులుగా చేరవచ్చని ఆయన సూచించారు. సాంకేతిక అక్షరాస్యత కోసం గ్రామాల దత్తత తీసుకోవడంతోపాటు నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడం కోసం డిజిథాన్‌ కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు.

కాచి కులస్తులకు ప్రభుత్వం అండ

గోల్కొండ: కాచి కులస్తుల ప్రభుత్వం అండగా ఉందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్‌ చైర్మన్‌ జి.నిరంజన్‌ అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కాచి సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కాచి సంఘం ప్రధాన కార్యదర్శి తిలక్‌సింగ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాచి కులస్తులు వ్యాపారంలోనే కాకుండా విద్యా, రాజకీయ రంగాల్లో కూడా తమ సత్తాచాటాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న కులగణనలో కాచి కులస్తులందరూ తమ తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రారంభమెప్పుడో..?

ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోని ట్రాఫిక్‌ సిగ్నల్స్‌



మైహోం అవతార్‌ సర్కిల్‌లో ప్రారంభానికి నోచుకోని సిగ్నల్స్‌

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని అధికారులు

మణికొండ: ప్రతిరోజూ ఎదురవుతున్న ట్రాఫిక్‌ సమస్యను కాస్తయినా నివారించే క్రమంలో కొన్ని ప్రముఖ కూడళ్లలో ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ ఏర్పాటు చేశారు. మరికొన్ని కూడళ్లలో ఏర్పాటు చేసే విషయం ప్రతిపాదనల్లోనే ఉంది. కనీసం ఏర్పాటు చేసిన వాటినైనా ప్రారంభించి అక్కడయినా తమకు ఉపశమనం కలిగిస్తారని ప్రయాణికులు ఎదిరిచూస్తున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ల్యాంకోహిల్స్‌ జీ సర్కిల్‌, దీప్తిశ్రీ ఐటీ సంస్థ సర్కిల్‌, ఔటర్‌ సర్వీసు రోడ్డులో మైహోం అవతార్‌ గేటెడ్‌ కమ్యూనిటీ సర్కిల్‌లలో ఇటీవల ట్రాఫిక్‌ సిగ్నల్‌ లైట్లను ఏర్పాటు చేశారు. నెలలు గడుస్తున్నా వాటిని ప్రారంభించకపోవడంతో అలంకరణకు ఏర్పాటు చేశారా అని ప్రజలు విస్తుపోతున్నారు. ఆయా సర్కిళ్ల వద్ద ప్రతిరోజూ ప్రమాదాలు జరగడం, గాయాలపాలవ్వడం జరుగుతుందని, సిగ్నల్స్‌ ఉంటే సమస్య ఉండదని వారు పేర్కొన్నారు. మైంహోం అవతార్‌ సర్కిల్‌లో పెద్ద ప్రమాదాలు జరిగి అనేక మంది గాయాలపాలయ్యారని వారు వివరిస్తున్నారు. వాటిని వెంటనే ప్రారంభించి ట్రాఫిక్‌ సమస్యకు కాస్తయినా ఉపశమనం కలిగించాలని స్థానికులు కోరుతున్నారు.



ల్యాంకోహిల్స్‌ సర్కిల్‌లో నిరుపయోగంగా ఉన్న ట్రాఫిక్‌ సిగ్నల్స్‌

మరిన్ని సర్కిల్‌లలో అవసరం..

నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని సర్కిల్‌లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో తీవ్ర ట్రాఫిక్‌ సమస్య ఏర్పడుతుంది. అలాంటి సర్కిల్‌లలో వెంటనే ఏర్పాటు చేయాల్సిన సిగ్నల్స్‌ ఇప్పటి వరకు ఏర్పాటు చేయకపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపినా ఉన్నతాధికారులు మంజూరు చేయడం లేదని స్థానిక అధికారులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు రోడ్లపైకి వచ్చి ప్రజల సమస్యను తెలుసుకుని వాటిని నివారించేందుకు కృషి చేయాలని వారు కోరుతున్నారు. మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సర్కిల్‌ వద్ద ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ ఏర్పాటు విషయాన్ని పరిశీలించాలని కోరుతున్నారు. మర్రిచెట్టు నుంచి ఆంధ్రాబ్యాంక్‌కు వచ్చే రోడ్డును వన్‌వేగా చేస్తే మణికొండ గ్రామంలో ట్రాఫిక్‌ సమస్య పూర్తిగా తొలగిపోతుందని వారు సూచిస్తున్నారు. ఫుట్‌పాత్‌లు, రోడ్ల పక్కన ఇష్టారాజ్యంగా వస్తున్న ఆక్రమణలు, షాపులను తొలగించి ట్రాఫిక్‌ సమస్యను పరిష్కరించాలని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల ప్రజలు కోరుతున్నారు.

సందడిగా ఫుడ్‌ ఫెస్టివల్‌



ఫుడ్‌ఫెస్ట్‌లో వంటకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

శంషాబాద్‌: ‘మీరు సొంతంగా తయారు చేసి తీసుకొచ్చిన వంటలన్నీ చాలా బాగున్నాయి. ఒక్కొక్కటి రుచి చూస్తుంటే ఇంట్లో తిన్నట్లే కమ్మగా ఉన్నయ్‌..ఇలాంటి కార్యక్రమాలతో మీలో ఉన్న ప్రతిభను వెలికి తీస్తాయి’అని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్‌ ఫెస్టివల్‌లో రుచులను ఆస్వాదించి వారిని భేష్‌ అని మెచ్చుకున్నారు. ఫుడ్‌ ఫెస్టివల్‌ను ప్రారంభించిన ఆయన ఒక్కో స్టాల్‌ వద్దకు వెళ్లి అన్ని అడిగి తెలుసుకోవడంతో పాటు రుచులు చూశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం కోసం తప్పకుండా కృషి చేస్తానన్నారు. విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న కారణంగా సొంత భవనం ఎంతో అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ హిమబిందు, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు భాను ప్రకాష్‌, దుర్గాభవాని, కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్‌, మాజీ కౌన్సిలర్లు రేఖగుప్తా, అజయ్‌, వై.కుమార్‌, జహంగీర్‌ఖాన్‌, స్థానికులు మురళీయాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ మీడియేషన్‌ సెంటర్‌ ప్రారంభం



సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

అత్తాపూర్‌: కమ్యూనిటీ మీడియేషన్‌ సెంటర్ల ద్వారా డబ్బులు, సమయం వృథా చేసుకోకుండా కేసులను పరిష్కరించవచ్చునని రంగారెడ్డి జిల్లా సెషన్స్‌ కోర్టు జడ్జి, తెలంగాణ స్టేట్‌ లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ మెంబర్‌ సెక్రటరీ సీహెచ్‌ పంచాక్షరి తెలిపారు. అత్తాపూర్‌ వాసుదేవారెడ్డినగర్‌ కాలనీలో నాంపల్లి శ్రీకాంత్‌, శంకర్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ మీడియేషన్‌ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్టేట్‌ లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ ఆధ్వర్యంలో మీడియేషన్‌ సెంటర్‌ అత్తాపూర్‌లో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అలాగే హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమ్యూనిటీ మీడియేషన్‌ సెంటర్‌లో అనుసరించాల్సిన విధివిధానాలపై మూడు రోజుల పాటు శిక్షణ పొందిన 15 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్‌ లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ ఏవో సీనియర్‌ జడ్జి కళార్చన, జిల్లా డీఎల్‌ఎస్‌ సెక్రటరీ సీనియర్‌ సివిల్‌ జడ్జి శ్రీదేవి, ఇతర జిల్లా న్యాయమూర్తులు, అత్తాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్సై, ట్రైనింగ్‌ పొందిన మీడియేషన్‌ సెంటర్‌ సభ్యులు రామారావు, సురేష్‌, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న మున్సిపల్‌ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేసురత్నం

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ బుద్వేల్‌ ఏ.ఆర్‌.దేవరాజ్‌ భవన్‌ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ మున్సిపల్‌ కాంట్రాక్ట్‌ ఔట్‌ సోర్సింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌ (ఏఐటీయూసీ) రంగారెడ్డి జిల్లా మున్సిపల్‌ కార్మికుల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాన్ని మున్సిపల్‌ సంఘం జిల్లా నాయకులు మద్దిలేటి అధ్యక్షత నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్‌ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యేసురత్నం హాజరై మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్‌ కార్మికులకు ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కార్మికులను పట్టించుకోకపోవడంతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గత ప్రభుత్వాన్ని గద్దె దించామన్నారు. కాంగ్రెస్‌ పార్టీకి కార్మికులు అధికారం కట్టబెట్టడితే..గొప్పలు చెప్పుకుంటుంది తప్పా..మున్సిపల్‌ కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం రంగారెడ్డి జిల్లా మున్సిపల్‌ సంఘం ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా మున్సిపల్‌ కార్మికులకు ప్రతినెలా ఒకటో తేదీన ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ సంఘం నాయకులు రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు పుస్తకాల నర్సింగ్‌ రావు, ఇన్సాఫ్‌ జిల్లా కార్యదర్శి ఎం.ఎ.రియాజ్‌, రాజేంద్రనగర్‌ మండల కార్యదర్శి టి.ఆనంద్‌, సాయిలు, రాజు, శ్రీకాంత్‌, పుల్లగళ్ల మల్లేష్‌, ఏ.పాండు గౌడ్‌, కుమార్‌, రంజిత్‌, లక్ష్మి, శాంతమ్మ, సబితా, రుబెల్‌, బుచ్చయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ బకాయిలపై దృష్టి సారించాలి



హిమాయత్‌సాగర్‌లో పెండింగ్‌ బిల్లులపై సమీక్షిస్తున్న విద్యుత్‌ డీఈ రత్నాకర్‌రావు

బండ్లగూడ: విద్యుత్‌ బిల్లుల వసూళ్లపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని విద్యుత్‌ డీఈ పి.రత్నాకర్‌రావు తెలిపారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని హిమాయత్‌సాగర్‌లో శుక్రవారం పెండింగ్‌ బిల్లులపై విద్యుత్‌శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వినియోగదారులను పెండింగ్‌ బిల్లులు చెల్లించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ అమర్‌సింగ్‌, ఏడీఈ సత్యనారాయణ, విద్యుత్‌ సిబ్బంది పాల్గొన్నారు.

‘అనిల్‌కుమార్‌ బెయిల్‌ రద్దు సబబే’

మణికొండ: చిత్రపురి హౌసింగ్‌ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్‌ బెయిల్‌ రద్దుపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు సమర్థించిందని చిత్రపురి సాధన సమితి అధ్యక్షుడు, సినిమా డైరెక్టర్‌ కస్తూరి శ్రీనివాస్‌ తెలిపారు. రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో చిత్రపురిలో జరిగిన అక్రమాలపై అతను ఇచ్చిన ఫిర్యాదుతో నమోదైయిన కేసుతో గతంలో అనిల్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. దీంతో అతను జిల్లా కోర్టులో కండీషన్‌ బెయిల్‌ తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా పత్రికా సమావేశాలు ఏర్పాటు చేయడం, బెదిరింపులకు పాల్పడ్డాడని ఆయన వివరించారు. వాటిని సాక్ష్యాధారాలతో హైకోర్టుకు వివరించటంతో బెయిల్‌ రద్దు చేసి అతన్ని పోలీసుల ఎదుట లొంగిపోవాలని ఆదేశించిందన్నారు. దీంతో అతను సుప్రీంకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నాడన్నారు. అక్కడా నిబంధనలను పాటించకపోవటంతో ఆ విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లడంతో అతని బెయిల్‌ రద్దు సబబేనని, బెయిల్‌ నిబంధనలను పాటించాల్సిందేనని, వెంటనే పోలీసుల ఎదుట లొంగిపోవాలని ఈనెల 20న ఆదేశించిందని శ్రీనివాస్‌ ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బండ్లగూడ: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేషన్‌ కమిషనర్‌ బి.శరత్‌ చంద్రను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బైరాగిగూడ ప్రభుత్వ పాఠశాల ప్రహరీ పడిపోవడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెరుగైన సౌకర్యాలు కల్పించి వారికి సమస్యలు లేకుండా చూడాలన్నారు. సమస్యను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే ప్రహరీకి మరమ్మతులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రిన్సిపాల్‌ ఇంద్రమ్మ, వ్యవసాయ మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ తలారి ప్రేమ్‌కుమార్‌, భోగాల శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆవిష్కరణలే ‘మనూ’ లక్ష్యం

మనూ’ఇన్‌చార్జి వైస్‌ చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ పీఎఫ్‌ రహమాన్‌

రాయదుర్గం: శాస్త్రీయ ఆవిష్కరణలను పెంచడం, విద్యాపరమైన నైపుణ్యాలు విద్యార్థులలో పెంపొందించడమే లక్ష్యంగా ఉర్దూ విశ్వవిద్యాలయం పని చేస్తుందని ‘మనూ’ఇన్‌చార్జి వైస్‌ చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ పి.ఎఫ్‌.రహమాన్‌ అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం(మనూ)లో డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ ఫిజిక్స్‌ ఆధ్వర్యంలో ‘మనూ’అప్‌లైడ్‌ ఫిజిక్స్‌లో వస్తున్న మార్పులపై జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనువర్తిత భౌతికశాస్త్రంలో తాజా పరిణామాలను చర్చించేందుకు నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలను ఒక చోట చేర్చి సమావేశం నిర్వహించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. సదస్సులో ఢిల్లీ విశ్వవిద్యాలయం ఫిజిక్స్‌, ఆస్ట్రోఫిజిక్స్‌ విభాగ ప్రొఫెసర్‌ ఎస్‌ఏహష్మీ, ఢిల్లీ విశ్వవిద్యాలయం స్కూల్‌ ఆఫ్‌ ఫిజికల్‌ సైన్సెస్‌ ప్రొఫెసర్‌ మనీష్‌కుమార్‌, ప్రొఫెసర్‌ మహ్మ ద్‌ రఫీక్‌ అబుతురాబ్‌, ప్రొఫెసర్‌ అలీమ్‌ హెచ్‌ భాషా, సదస్సు కన్వీనర్‌ డాక్టర్‌ మహ్మద సాదిక్‌ పాల్గొన్నారు. సదస్సుకు ఏడు దేశాల నుంచి 130 కంటే ఎక్కువ పత్రాలు సమర్పించగా, అందులో 110 పత్రాలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పలువురు ఫిజిక్స్‌ ప్రొఫెసర్లు, నిష్ణాతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్‌

రాజేంద్రనగర్‌: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎం.లక్ష్మీనివాస్‌ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో శుక్రవారం తెలంగాణ సామాజిక స్టూడెంట్‌ ఆర్గనైజేషన్‌ (టీఎస్‌ఎస్‌ఓ) ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీనివాస్‌ మాట్లాడుతూ..పరీక్షల్లో మంచి ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువైన సూచనలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఎస్‌ఓ నాయకులు రఘు ముదిరాజ్‌, సుధాకర్‌, టీఎస్‌ఎస్‌ఓ రాజేంద్రనగర్‌ కమిటీ సభ్యులు, ప్రిన్సిపాల్‌ సుధారాణి, వైస్‌ ప్రిన్సిపాల్‌ శ్యాంసుందర్‌ తదితరులు పాల్గొన్నారు.

దోమలను అరికట్టాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: దోమలను అరికట్టాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన టోలిచౌకీ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బల్దియా ఎంటమాలజీ అధికారులతో కలిసి గోల్కొండ నయాకీలా కందకానికి ఆనుకొని ఉన్న శాతం చెరువును పరిశీలించారు. శాతం చెరువులో పేరుకుపోయిన చెత్తాచెదారం, గుర్రపు డెక్కను చూసి ఆయన చెరువు దుస్థితికి అధికారులే కారణమన్నారు. చెరువులు, కుంటలు, నాలాలు ఇదే విధంగా ఉంటే దోమలు విజృంభించవా అని ఆయన అధికారులను ప్రశ్నించారు. ప్రతి నిత్యం బల్దియా సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. ఇందులో భాగంగా నాలాలు, నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో దోమల మందు పిచికారీ చేయాలని సూచించారు. శాతం చెరువుతో పాటు బుల్కాపూర్‌ నాలా, గోల్కొండ ప్రహరీలను ఆనుకొని ఉన్న కందకాల్లో పిచ్చి మొక్కలు తొలగించి దోమలు వృద్ధి చెందకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



బాబుల్‌రెడ్డినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో..

మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డినగర్‌ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సావన్ని నవయువ యూత్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత మాత చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించి మాతృభాష ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా క్లబ్‌ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ..మాతృభాష మన సంస్కృతికి నాంది అని, దాన్ని పరిరక్షిణ మన బాధ్యతగా పేర్కొన్నారు. అలాగే చిన్నారులకు ప్రాథమిక స్థాయిల మాతృభాషలోనే విద్యాబోధన అందించాలన్నారు. క్లబ్‌ ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ మాతృభాష మన సంస్కృతి, మనకూ భవిష్యత్‌ తరాలకు వారసత్వంగా అందించాల్సిన ముఖ్యమైన సంపద అని అన్నారు. ఈ కార్యక్రమంలో వాడిగాచర్ల మల్లేష్‌, అంగన్‌వాడీ టీచర్‌ అనిత, హెల్పర్‌ సంగీత, ఇతర సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. చెన్నకేశవ స్వామి కల్యాణం




చెన్నకేశవ స్వామి కల్యాణం చేస్తున్న వేద పండితులు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని స్వయంభూ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి కల్యాణ మహోత్సవం శుక్రవారం నేత్ర పర్వంగా కొనసాగింది. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారి తిరు కల్యాణోత్సవాన్ని జరిపించారు. అనవాయితీలో భాగంగా చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌ తరఫున ఎస్సై శ్రీనివాస్‌ స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సీఆర్‌పీఎఫ్‌ సిబ్బంది బ్యాండ్‌ మేళాలను వాయించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి 8 గంటలకు స్వామి వారి పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. ఈఓ శివ రుద్రప్ప, అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యులు, పాలక మండలి చైర్మన్‌ ఎ.మహేష్‌ గౌడ్‌, కమిటీ సభ్యులు బి.వందన, విజయలక్ష్మి, శ్రీధర్‌, శైలేష్‌ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కల్యాణ మహోత్సవంలో బడంగ్‌పేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ మాజీ మేయర్‌ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేష్‌ ముదిరాజ్‌, కాంగ్రెస్‌ చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా నియోజకవర్గాల ఇన్‌చార్జులు బోయ నగేష్‌, రవిరాజు, లింగోజిగూడ కార్పొరేటర్‌ రాజశేఖర్‌రెడ్డి, ఇంటిలెజెన్స్‌ ఏసీపీ రుద్ర భాస్కర్‌, నాయకులు అశోక్‌ ముదిరాజ్‌, జుర్కీ రాజేందర్‌, గాజుల వెంకటరమణ, రాజు ముదిరాజ్‌, ప్రమోద్‌ కార్వంకర్‌, నాగరాజు, అంబటి రాజేష్‌ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్‌ ఆర్ట్స్‌లో సత్తా

మైలార్‌దేవ్‌పల్లి: ఖేలో ఇండియా స్టేట్‌ మీట్‌ ఉషు ఉమెన్స్‌ లీగ్‌-2025 సబ్‌ జూనియర్‌, జూనియర్‌, సీనియర్స్‌ చాంపియన్‌షిప్‌లో మైలార్‌దేవ్‌పల్లి మహవీర్‌ మార్షల్‌ ఆర్ట్స్‌ విద్యార్థిని సత్తాచాటింది. ఆదిలాబాద్‌లోని ప్రియదర్శిని ఇండోర్‌ స్టేడియంలో తెలంగాణ స్టేట్‌లో 19 ఫిబ్రవరి 2025న జరిగిన కాంపిటీషన్‌లో పీఎం శ్రీ తెలంగాణ మోడల్‌ స్కూల్‌ అండ్‌ గవర్నమెంట్‌ జూనియర్‌ పాలమాకుల కాలేజీకి చెందిన బుర్ర కీర్తి అండర్‌-17లో 60 కేజీల విభాగంలో బ్రౌంజ్‌ మెడల్‌ కైవసం చేసుకున్నారు. ప్రిన్సిపాల్‌ రజిని విద్యార్థినిని అభినందించి సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోచ్‌ సంతోష్‌యాదవ్‌, పి.డి.రాధాకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కీర్తిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌ రజిని తదితరులు